# పీడిత ప్రజల ముద్దుబిడ్డ, ఆయుధ శిల్పి,
# సాహసిక పట్టణ గెరిల్లా, ఆదర్శ కమ్యూనిస్టు
# కామ్రేడ్ దాసారపు కనకస్వామికి అరుణాంజలి!



భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ



కామ్రేడ్ కనకస్వామి (అమన్) మృతదేహం

# పీడిత ప్రజల ముద్దుబిడ్డ, ఆయుధ శిల్పి, సాహసిక పట్టణ గెరిల్లా, ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ దాసారపు కనకస్వామికి అరుణాంజలి!

పీడిత, తాడిత ప్రజల ఉత్తమ పుత్రుడు కామ్రేడ్ దాసారపు కనకస్వామి (బాబ్జీ, అమన్) 24 సెప్టెంబరు 2012 ఉదయం 9.10 గంటలకు ఫాల్సిపెరం మలేరియాతో పోరాడుతూ, బిపి సమస్య కూడా వికటించడంతో అమరుడైనాడు. ఆయనను రక్షించుకోవడానికి సహచరులు, ప్రజలు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. పట్టణ రహస్య జీవితంలో అనామకంగా చనిపోకూడదనీ, సహచర పిఎల్‌జిఏ యోధుల, ప్రజల నడుమనే చనిపోవాలనే తన చిరకాలపు కోరికను నెరవేర్చుకుంటూ, అందరినీ విషాదంలో ముంచుతూ తుదిశ్వాస విడిచాడు. దాదాపు మూడు దశాబ్దాల పాటు విప్లవోద్యమానికి ఎనలేని కృషి చేసిన కామ్రేడ్ అమన్‌ను కోల్పోవడం పార్టీకీ, విప్లవోద్యమానికీ తీవ్రమైన నష్టం. ఆయన అమరత్వంతో ఉద్యమం ఎంతో అనుభవం కలిగిన ఒక మంచి కమ్యూనిస్టు టెక్నీషియన్‌ను కోల్పోయింది. విప్లవోద్యమానికి, ప్రజలకు మరెంతో కాలం పాటు సేవలందించాల్సిన కామ్రేడ్ అమన్ అకాల మృతితో పార్టీ శ్రేణులు, ప్రజలు తీవ్రంగా కలత చెందారు. అతని ఆశయాన్ని కడదాకా కొనసాగిస్తామని ప్రతిన బూనారు. అతని ఆదర్శాల్ని, సేవల్ని ఎత్తిపట్టారు.

## విప్లవాల ఖిల్లా ఓరుగల్లు జిల్లాలో రూపు దిద్దుకున్న బాల్యం

కామ్రేడ్ అమన్ వరంగల్ జిల్లా మద్దూరు మండలం కూటిగల్ గ్రామంలో ఒక పేదరైతు కుటుంబంలో 1969 జులై 26న జన్మించాడు. తల్లి లక్ష్మమ్మ, తండ్రి ఈదయ్యల ఇద్దరు కుమారులలో అమన్ చిన్నవాడు. చిన్నప్పటి నుండీ దోపిడి పీడనల మధ్య బతుకులు వెళ్లదీసే పేదల పేదరికాన్ని చూశాడు. అది మెట్ట ప్రాంతం కావటం మూలంగా వర్షాధారపు పంటలే పండేవి. వర్షాలు కురవలేదంటే కరువు రాజ్యమేలేది.

1940ల చివరలో మహత్తర తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం చురుగ్గా సాగిన ప్రాంతమిది. ఆ పోరాట వారసత్వం పునికి పుచ్చుకున్న నవతరాన్ని నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాటాలు తట్టి లేపాయి. ఆ ఉద్యమాల సెట్‌బ్యాక్ తర్వాత తిరిగి 'జగిత్యాల జైత్రయాత్ర' ప్రసిద్ధి గాంచిన రైతాంగ వుద్యమం ఇక్కడి గ్రామాలన్నిటినీ కదిలించింది. ఆ సమయంలో

‘గ్రామాలకు తరలండి’ క్యాంపెయిన్‌ల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థి యువజనులు విప్లవ రాజకీయాలు ప్రచారం చేస్తూ రైతాంగాన్ని సంఘటితం చేశారు. కాలేజీలలో, పాఠశాలల్లో రాడికల్ విద్యార్థి సంఘాలు ఏర్పడి పనిచేస్తున్న సందర్భంగా ధూల్మిట్ట హాస్టల్, పాఠశాలల్లో కూడా రాడికల్ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యు) ఏర్పడింది. కా॥ కనకస్వామికి ధూల్మిట్ట హాస్టల్‌లో విప్లవ రాజకీయాలు పరిచయమయ్యాయి. ఆయన హాస్టల్‌లో ఉంటూ 7వ తరగతి వరకు చదువుకున్నాడు. 1983లో రాడికల్ విద్యార్థి సంఘంలో చేరాడు.

వందలాది విద్యార్థులు చదువుకునే ధూల్మిట్ట స్కూలు రాడికల్ విద్యార్థి సంఘానికి బలమైన కేంద్రంగా ఉండేది. దీన్ని రాడికల్స్ కోటగా వ్యవహరించేవారు. ప్రతి సంవత్సరం జరిగే విద్యార్థి సంఘం ఎన్నికలలో రాడికల్స్ పానల్ గెలిచేది. హాస్టల్ వసతుల కోసం, పాఠ్యపుస్తకాలు, ఆటవస్తువులతో పాటు గణితం, ఇంగ్లీషు టీచర్ల నియామకం వగైరా డిమాండ్లతో చేసిన సమ్మె పోరాటంలో రెండు వారాల పాటు స్కూళ్ల బహిష్కరణ చేశారు. ఈ పోరాటం చుట్టుపక్కల గ్రామాలైన ఆకునూర్, లద్దునూరు, మద్దూరు, చేర్యాల, నర్మెట్ట, తరిగొప్పుల, బచ్చన్నపేట, బైరాన్‌పల్లి స్కూళ్లల్లో చదువుకుంటున్న విద్యార్థులను ప్రభావితం చేసింది. చేర్యాల టౌన్‌లో ఆర్ఎస్‌యు బలపడటానికి దోహదం చేసింది. సహజంగానే గ్రామంలో పెత్తందారుల, రాజకీయ నాయకుల దోపిడి, దౌర్జన్యాలను అసహ్యించుకునే కనకస్వామి పార్టీ పరిచయమైన తర్వాత చదువు కంటే విప్లవోద్యమ కార్యకలాపాలకే ఎక్కువ ప్రాధాన్యత యిచ్చాడు. పాఠశాలలో బంద్‌లు, బాయ్‌కాట్‌ల సందర్భంగా నేరుగా తరగతి గదులలోకి వెళ్ళి విద్యార్థులతో తరగతులు బాయ్‌కాట్ చేయాల్సిందిగా మాట్లాడి ఆ కార్యక్రమాన్ని సఫలం చేయడంలో ముందుండేవాడు.

హాస్టల్‌లో వార్డెన్ అవినీతిని బహిర్గతం చేసి ప్రతి విద్యార్థికి కోటా ప్రకారం రావాల్సిన రేషన్, ఇతర సౌకర్యాలను చెల్లించేలా జరిగిన పోరాటాలలో కామ్రేడ్ కనకస్వామి పాల్గొన్నాడు. ధూల్మిట్ట హాస్టల్ 1990 వరకు చుట్టుపక్కల 20, 25 గ్రామాలకు విప్లవ రాజకీయాలను ప్రచారం చేసే కేంద్రంగా పని చేసింది. ఇక్కడ విద్యార్థులు రోజూ అనేక బ్యాచీలుగా విడిపోయి ‘క్రాంతి’, ‘రాడికల్ మార్చ్’, ‘కార్మికపథం’ వంటి విప్లవ పత్రికలను పంపిణీ చేయడం, కరపత్రాలు పంచడం, పోస్టర్లు వేయడం, వాల్‌రైటింగ్ చేయడం వంటి కార్యకలాపాల్లో పాల్గొనేవాళ్లు. సారా వ్యతిరేక పోరాటాలలో, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలో విద్యార్థులు పాలు పంచుకున్నారు. 1984 వరకు కా॥ కనకస్వామి ఇలాంటి కార్యక్రమాలన్నింటిలో పాల్గొనేవాడు. ఈ కారణంగా ధూల్మిట్ట గ్రామంలోని బి.జె.పి, టి.డి.పి పార్టీలకు చెందిన భూస్వాములు పోలీసులతో వారానికి ఒకసారైనా ఈ హాస్టల్‌పై దాడులు చేయించేవారు. అందువల్ల బహిర్గతం అయిన విద్యార్థులు రాత్రుళ్ళు హాస్టల్లో కాకుండా వేరేచోట పడుకొనేవారు. కా. కనకస్వామి

కూడా ఇలాగే బావుల దగ్గర, అడవిలో, పరిచయస్తుల ఇండ్లలో పడుకొనేవాడు. గ్రామంలో కామ్రేడ్ కనకస్వామి తన తోటి యువకులకు పెత్తందార్లు, భూస్వాములు, రాజకీయ నాయకుల దోపిడీ, దౌర్జన్యాలను ప్రశ్నించడం నేర్పేవాడు. అలాగే ఈ ప్రజా వ్యతిరేకులు ఎదురుపడితే నమస్కరించడం, లేచి నిలబడడం లాంటివి తనెప్పుడూ చేసేవాడు కాదు. తన తోటి పిల్లలను, విద్యార్థులను వెంటేసుకొని పాటలు పాడటం, కంజీర కొట్టటం నేర్పేవాడు. అంతే కాకుండా ప్రజలకు పాటలు పాడి వినిపించి, వాటిలోని సారాంశాన్ని చెప్పేవాడు. దీనివల్ల పిల్లలేకాక, పెద్దలు కూడా కా॥ కనకస్వామిని గౌరవ మర్యాదలతో చూసేవారు. పిలిచి మరీ విప్లవ పాటలు పాడించుకొనేవారు.

చదువుకుంటున్న రోజుల్లో కా. కనకస్వామి చుట్టుపక్కల గ్రామాలలో సాగే విప్లవ రైతాంగ పోరాటాలతో ప్రేరణ పొందాడు. 1984లో పార్టీ ఇచ్చిన పిలుపునందుకుని 'గ్రామాలకు తరలండి' క్యాంపెయిన్‌లో పాల్గొని విప్లవ గీతాలాలపిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలను గ్రామాలలో ప్రచారం చేశాడు. సహజంగానే, ఒక వారసత్వంగానే భూస్వామ్య వ్యవస్థను అసహ్యించుకునే నేపథ్యంలో పుట్టి పెరిగిన కామ్రేడ్ కనకస్వామి విద్యార్థి సంఘం కార్యకర్తగా పని చేస్తున్న క్రమంలో సాయుధ విప్లవమే దేశ విముక్తికి, నిజమైన స్వాతంత్రానికి మార్గమని నమ్మకం ఏర్పర్చుకున్నాడు. అప్పటికే విప్లవోద్యమంలో క్రియాశీలంగా పని చేస్తున్న తన తోటి విద్యార్థుల నుండి, పార్టీ ఆర్గనైజర్ల నుండి ప్రేరణ పొందుతూ చిన్న వయస్సులోనే ఇంటిని వదిలెయ్యడానికి సిద్ధపడ్డాడు. అలా 1984లో, 15 సంవత్సరాల అతి చిన్న వయసులోనే పూర్తి కాలం కార్యకర్తగా పార్టీలో చేరిపోయాడు. అతని లాంటి ఎందరో యువ కిషోరాల్ని విప్లవకారులుగా మల్చిన కాలం అది.

## రైతాంగ పోరాటాల చాలులో విరిసిన ఎర్ర మొలక

వరంగల్ జిల్లాలో బైరాన్‌పల్లి, బెక్కల్, కూటిగల్, సోలిపురం, కొండాపురం, ఆంక్షాపురం, దోర్నాల, తరిగొప్పుల, పోతారం, అబ్బాపురం, వంగపల్లి, ధూల్మిట్ట తదితర గ్రామాల రైతాంగం భూపోరాటాలలో, కూలి పోరాటాలలో కదిలింది. ఈ క్రమంలో గ్రామంలో రైతు కూలీ సంఘం బలపడింది. 1981 నుండి 83 నడుమ జనగాం ప్రాంతంలో లేచిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాల ప్రభావం యువతపై పడింది. ఈ పోరాటాలలో వందల ఎకరాల భూస్వాముల భూములను గుంజుకుని దళితులకు పంచారు. జీతాల పెంపుదల, కూలిరేట్ల పెంపుదలను డిమాండు చేస్తూ జీతగాళ్ల, కూలీల పోరాటాలు ఉవ్వెత్తున లేచాయి. గ్రామాలలో వడ్డీ వ్యాపారుల అక్రమాల, వ్యాపారుల తప్పుడు తూకాలకు వ్యతిరేకంగా పోరాటాలు నడిచాయి. పంటలకు

గిట్టుబాటు ధరలను డిమాండు చేస్తూ సబ్ డివిజన్ వ్యాప్తంగా పోరాటాలు నడిచాయి. కరువు ప్రాంతంగా ప్రకటించాలనే డిమాండుతో వేల మంది ప్రజలు ప్రదర్శనలు చేసిన ఫలితంగా 1982లో కరువు ప్రాంతంగా ప్రకటించారు. గోదావరి నుండి నీటి మళ్లింపు, ఎత్తిపోతల పథకం డిమాండుతో చేర్యాలలో పెద్ద ర్యాలీ నిర్వహించారు. ఆ ప్రాంతంలోని వందకు పైగా గ్రామాల ప్రజలు వేల సంఖ్యలో హాజరయ్యారు. ర్యాలీకి ముందు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం తర్వాత లాఠీచార్జి చేయించింది, వందల మందిని అరెస్టు చేయించింది. ఈ ర్యాలీలో పాల్గొన్న కామ్రేడ్ కనకస్వామి దోపిడీ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక స్వభావాన్ని కళ్లారా చూశాడు.

ధూల్మిట్ట శివారు గ్రామమైన బైరాన్‌పల్లి తెలంగాణా సాయుధ పోరాట కాలంలో నిజాం రజాకారులను తరిమికొట్టిన వీరోచిత చరిత్ర గల గ్రామం. గ్రామంపై దాడికి వచ్చిన రజాకార్లను ప్రజలు రెండు సార్లు ప్రతిఘటించారు. మూడవసారి అంటే 1948లో నెహ్రూ సైన్యాల ప్రవేశానికంటే కొంచెం ముందు దాడి చేసిన కిరాయిమూకలు ఇక్కడ 87 మందిని ఊచకోత కోశాయి. ప్రజలు ప్రతిఘటిస్తూనే ప్రాణాలర్పించారు. ముగ్గురు పోలీసులను ఖతం చేసి తుపాకులు గుంజుకున్నారు. తెలంగాణా సాయుధ పోరాటంలో అసువులు బాసిన వీర ప్రజానీకానికి స్మృతిగా 1982లో స్థూప నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన బహిరంగసభకు వేలాది ప్రజలు పాల్గొన్నారు. చిన్నారి కనకస్వామి తన స్నేహితులను వెంటేసుకుని ప్రచార బ్యాచ్‌లతో కలిసి పాటలు పాడుతూ ఆ సభ గురించి ప్రచారం చేశాడు.

1984లో విప్లవోద్యమంలో భాగస్వామి అయ్యి 2012లో అమరుడయ్యే నాటి వరకు ఎన్నెన్నో బాధ్యతలు నిర్వహించాడు. బాబ్జీ, అమన్ తదితర మారుపేర్లతో విప్లవ కార్యకలాపాల్లో పాలు పంచుకున్నాడు. 1984 మధ్య నుండి 1985 మధ్య వరకు నర్సంపేట సెంట్రల్ ఆర్గనైజర్ (అమరుడు పైండ్ల వెంకట రమణ – కడవెండి)కి గార్డుగా బాధ్యతలు నిర్వహించాడు. ఆ తర్వాత హైదరాబాద్‌లో కార్మికుడిగా పని చేస్తూ కొరియర్‌గా పని చేశాడు. అటు తర్వాత పార్టీ అవసరాల నిమిత్తం టెక్నికల్ రంగంలో ప్రవేశించి ఆయుధాల తయారీలో నైపుణ్యం సంపాదించాడు. వందలాది తుపాకులు, వేలాది గ్రెనేడ్లు తయారు చేసే యూనిట్లలో వివిధ బాధ్యతలు నిర్వహించి వాటిని యుద్ధరంగానికి సరఫరా చేయడంలో తన వంతు పాత్ర పోషించాడు.

## శత్రువు కంట్లో దుమ్ము కొట్టిన కొరియర్

1985 తర్వాత వరంగల్ జిల్లా సెక్రటరీ కామ్రేడ్ పులి అంజన్నకి కొరియర్‌గా అత్యంత కీలకమైన బాధ్యతలు చేపట్టి శత్రుమూకల కళ్లుగప్పి జిల్లాకు, రాష్ట్ర కమిటీకి మధ్య వారధిలా పని చేశాడు. కొంత కాలం వరంగల్ పట్టణ ఆర్గనైజరు అమరుడు కామ్రేడ్ రామకృష్ణకు

కొరియర్‌గా పనిచేశాడు. ఆ కాలంలో అప్పుడే కలిసి చాయ్ తాగి విడిపోయిన సహచరులు కొన్ని గంటల్లో పోలీసుల బూటకపు ఎన్‌కౌంటర్లలో రోడ్డుపై శవాలుగా మారటం సాధారణ దృశ్యం. సిటీ ఆర్గనైజర్లయిన కామ్రేడ్స్ రామకృష్ణ, యాకయ్య, నాగేశ్వర్‌రావులను పట్టుకుని బూటకపు ఎదురుకాల్పుల్లో చంపేసి హంటర్ రోడ్‌లో పడేసిపోతే వారిని కలిసే అపాయింట్‌మెంట్‌కి వచ్చిన కా. అమన్ శవాల దగ్గరికి పోయి వారిని గుర్తుపట్టడమే కాక వెంటనే వార్తా పత్రికలకు స్టేట్‌మెంట్ పంపించాడు. ఆ సమయంలో ఎంతో సమయస్ఫూర్తిని, మరెంతో గుండె నిబ్బరాన్ని ప్రదర్శించాడు. రాష్ట్ర కమిటీ కొరియర్‌గా వున్నపుడు అమరులు కామ్రేడ్స్ దామోదర్, శాఖమూరి అప్పారావు, పటేల్ సుధాకర్ లాంటి వారితో కలిసి పనిచేశాడు. తన సహచరులు శత్రు చెర చిక్కిన వార్త తెలవగానే వారికి తెలిసిన డెన్నులను కొద్ది గంటల సమయంలోనే ఖాళీచేసి తూటాలు, తుపాకులను సురక్షిత ప్రదేశానికి తరలించేవాడు. తాను కొరియర్‌గా పనిచేస్తున్న కాలంలో అనేకసార్లు శత్రువు పన్నిన చక్రవ్యూహం నుండి చాకచక్యంగా తప్పించుకున్నాడు. వళ్లంతా కళ్లు చేసుకుని పరిసరాలను పరిశీలించి శత్రు జాడ పసిగట్టడంలో ఎంతో పట్టు సాధించాడు. కా. పులి అంజన్న అమరుడయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కా. మహేష్ (సంతోష్ రెడ్డి)కు కొరియర్‌గా కొంతకాలం పనిచేశాడు. తనతో పాటు నల్లమల గెరిల్లా జోన్ పరస్పెక్టివ్ ఏరియాకు పయనమయ్యాడు. చిన్నప్పుడు కాకతాళీయంగా జరిగిన ఒక దుర్ఘటన అతనికి జీవితకాలపు అంగవైకల్యాన్నిచ్చింది. కుడికన్నులో ఏర్పడ్డ పొర వల్ల రాత్రి పూట నడకకు చాలా ఇబ్బంది పడేవాడు. అయితే ఈ విషయం తెలిస్తే తనను దళంలో పనికిరావని పంపించేస్తారేమోననే భయంతో తన సమస్యను తెలియనియ్యకుండా దాచిపెట్టాడు. చివరికి కా. మహేశ్‌కు సమస్య అర్థం అయింది. దానితో ఆ తరువాత పార్టీ అతనిని పట్టణాలలో పనికి మార్చింది.

## ప్రజాయుద్ధ రంగానికి తుపాకులందించిన అజ్ఞాత యోధుడు

1995 నుండి 2007 వరకూ కామ్రేడ్ అమన్ పార్టీ సెంట్రల్ టెక్నికల్ రంగంలో పనిచేశాడు. అనేక రాష్ట్రాలలో రహస్యంగా ఉంటూ గెరిల్లా దళాలకు ఆయుధాలు, గ్రెనేడ్లు తయారు చేసి అందించే బాధ్యతలు నిర్వహించాడు. తన టీము సభ్యులతో ఎంతో శ్రమకోర్చి వేలాది గ్రెనేడ్స్, వందలాది ఆయుధాలు అందించడంలో ముందున్నాడు. వాటిని తానే స్వయంగా నల్లమల, దక్షిణ తెలంగాణ ప్రాంతాలకు చేర్చేవాడు. టెక్నికల్ రంగంలో పట్టణాలలో ఉంటూ పనిచేస్తున్న క్రమంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనవలసి వచ్చినా వాటన్నిటినీ నిబ్బరంగా ఎదుర్కొంటూ ఒక మంచి టెక్నీషియన్‌గా ఎదిగాడు. గెరిల్లా యుద్ధాన్ని పురోగమింపచేయటానికి అవసరమైన

ఆయుధ సామగ్రిని తయారు చేసి అందించడంలో అహర్నిశలూ పనిచేస్తూ తన వంతు బాధ్యతను నిర్వహించాడు. తుపాకులను సైకిళ్లకు కట్టుకుని పోలీసు స్టేషన్ల ముందునుండే ఎలాంటి జంకు లేకుండా సురక్షిత ప్రదేశాలకు, అటవీ ప్రాంతాలకు తరలించేవాడు.

## క్రూర పోలీసు అధికారులను, ప్రజా కంటకులను మట్టుబెట్టిన గెరిల్లా

1993లో హైద్రాబాద్‌లో అత్యంత క్రూరుడైన పోలీసు అధికారి డిఐజి వ్యాస్ యాక్షన్‌ను విజయవంతం చేయటంలో తనవంతు సహాయ సహకారాలను చాకచక్యంగా అందించాడు. ఆ తర్వాత హైద్రాబాద్ నడిబొడ్డున యంఎల్‌ఏ సుధీర్ కుమార్‌ను బంధీగా పట్టుకుని శత్రు చెరలో నున్న పార్టీ నాయకులను విడిపించుకోవటంలో కూడా ఆయన అజ్ఞాత కృషి ఉన్నది.

జంట నగరాల్లోని కార్మికవాడల్లో, పేద బస్తీల్లో అలెగ్జాండర్ వంటి మేనేజిమెంట్ తొత్తులు, గూండాలు కార్మికుల, ప్రజల, స్త్రీల జీవితాలతో చెలగాటమాడుతూ వారిపై తీవ్రమైన దౌర్జన్యాలు చేసేవారు. అక్కడి పార్టీ అలాంటి కంటకులను కొందరిని ఎంపిక చేసి అంతమొందించింది. కామ్రేడ్ బాబ్జీ అటువంటి యాక్షన్లలో టీం సభ్యునిగా చురుకైన పాత్రను నిర్వహించి ఎంతో సాహసాన్ని ప్రదర్శించాడు.

## శత్రు చెరలో సైతం మొక్కవోని ఉక్కు సంకల్పం

2007 ప్రారంభంలో ఒడిషా రాష్ట్రంలోని రూర్కెలా పట్టణంలో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఇంటెలిజన్స్ బ్యూరో పోలీసు మూకలు పార్టీ నిర్వహిస్తున్న టెక్నికల్ విభాగపు టీము మీద చేసిన దాడిలో కామ్రేడ్ అమన్, అతని సహచరి, మరి కొందరు కామ్రేడ్స్ శత్రువు చేత చిక్కినారు. పోలీసులు అతనిని కేంద్ర నాయకత్వం కోసం ఎంత వేధించినా 'నాకు ఎవరూ తెలియదు' అంటూ ఒకేమాటపై దృఢంగా నిలబడ్డాడు. చెప్పనలవికాని చిత్రహింసలను ఆయన నిబ్బరంగా ఎదుర్కొని పార్టీ రహస్యాలను కాపాడినాడు. శత్రు నిర్బంధంలో, పోలీసు కస్టడీలో, జైలు జీవితంలో ఎన్నడూ శత్రువు కుతంత్రాలకు, ప్రలోభాలకు తలవంచలేదు. జైలు నిర్బంధంలో ఉన్న సుమారు రెండున్నర సంవత్సరాల కాలంలో క్రమశిక్షణగల పార్టీ సభ్యునిగా జైలు కమ్యూన్ కార్యక్రమాలన్నింటిలోనూ చురుకుగా పాల్గొని జనరల్ ఖైదీల మద్ధతు కూడగట్టడంలో తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాడు. జైలులోని అక్రమాలకు, అక్కడ సాగుతున్న అవినీతికి వ్యతిరేకంగా పోరాటాలు నడిపించడంలో తన వంతు పాత్రను నిర్వర్తించాడు. సుదీర్ఘ కాలం తర్వాత కుటుంబ సభ్యులు కలిసినా వర్గ బంధానికి ప్రాధాన్యతనిచ్చి ప్రజల పక్షాన దృఢంగా నిలబడ్డాడు. బెయిల్ దొరకగానే ఎటువంటి తటపటాయింపులు లేకుండా గట్టి సంకల్పంతో దండకారణ్య ఉద్యమంలో భాగమైపోయాడు. శత్రు నిర్బంధంలో ఆయన ఆచరణ మొత్తం విప్లవకారులందరికీ ఆదర్శం.

## ఎరుపు, నిపుణతల సంగమంగా ప్రవహించిన చైతన్యం

2007లో జరిగిన పార్టీ ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ ఇచ్చిన కేంద్ర కర్తవ్యం బీహార్–ఝార్ఖండ్–దండకారణ్యాలను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేయటం. ఇందుకోసం గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యాన్ని ప్రజా విముక్తి సైన్యంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో సాగుతున్న ప్రజాయుద్ధ అవసరాలను తీర్చటానికి తన అనారోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా అహర్నిశలూ శ్రమించాడు. 2009 మధ్య భాగం నుండి 2012 సెప్టెంబర్ వరకు అంటే మూడేళ్ల పాటు దండకారణ్య టెక్నికల్ విభాగంలో ఆయుధాల తయారీలో క్రియాశీలంగా పాల్గొన్నాడు. ఈ కాలంతో ఎందరో కార్యకర్తలకు తనకు తెల్సిన టెక్నికల్ స్కిల్స్‌ను నేర్పించాడు.

పార్టీ అవసరాల రీత్యా 1995 ఏప్రిల్‌లో టెక్నికల్ రంగానికి బదిలీ అయిన కామ్రేడ్ అమన్ తన బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చటం కొరకు అవసరమైన ఎన్నో టెక్నిక్స్‌ను పట్టుదలగా నేర్చుకున్నాడు. అప్పటి నుండి అమరుడయ్యేవరకూ టెక్నికల్ రంగపు అభివృద్ధిలోనూ ఒడిదుడుకుల్లోనూ ముఖ్య భాగస్వామియై అటు ప్రధాన ఉత్పత్తిరంగంలోనూ, మరో పక్క డెవలప్‌మెంట్ పనులలోనూ క్రియాశీలంగా పాల్గొని మన టెక్నికల్ రంగాన్ని అభివృద్ధి చేయటంలో ముఖ్య భూమికను నిర్వహిస్తూ జిల్లా/డివిజనల్ కమిటీ స్థాయికి ఎదిగాడు.

టెక్నికల్ రంగానికి రావటానికి ముందు కా. పులి అంజన్న కొరియర్‌గా ఉన్న కాలం నుండే కొనుగోలు చేసిన ఆయుధాలను రిసీవ్ చేసుకొని వాటిని సంబంధిత స్టోర్స్‌కు తరలించటం, స్టోర్ మెయింట్‌నెన్స్ చేయటం, తిరిగి వాటిని ఫీల్డ్‌కు అందించటంలో ఎంతో చాకచక్యంగా పని చేసేవాడు. ఆ క్రమంలో మెట్రోపాలిటన్ సిటీల్లో సైతం అన్ని రకాల వాహనాలను నడిపించే నైపుణ్యాన్ని సంపాదించాడు. ఆ అనుభవాలన్నీ టెక్నికల్ రంగానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి, ఆ పనిని సులభతరం చేసాయి కూడా. ఆయన విప్లవ జీవితంలో కార్మిక రంగంలో ప్రవేశించటమనేది విప్లవ జీవితంలో వచ్చే ఒడిదుడుకుల్లో భాగంగానే చోటుచేసుకుంది. కామ్రేడ్ పులి అంజన్న అమరుడైన తర్వాత కా. అమన్‌కు పార్టీతో సంబంధాలు తెగిపోయాయి. చేతిలో చిల్లిగవ్వ కూడ లేని పరిస్థితిలో, మనుగడే కష్టమైనపుడు మందుల దుకాణంలో, కిరాణా స్టోర్‌లో పనులు చేస్తూ పార్టీ కాంటాక్టు కోసం ప్రయత్నిస్తూ వచ్చాడు. ఆ క్రమంలో తార్నాకలోని పాల ఫ్యాక్టరీలో కార్మికుడిగా కూడా పని చేశాడు. కార్మికుడిగా అక్కడి కార్మికులతో మమేకమై వారికి క్రమంగా విప్లవ రాజకీయాలు బోధిస్తూ వారికి మంచి గురువుగా తయారైనాడు. అప్పటి ఆయన తొలి కార్మిక జీవితానుభవాలు తర్వాత టెక్నికల్ రంగానికి ఎంతగానో ఉపకరించాయి.

కా|మ్రేడ్ అమన్‌కు మొదటి నుండీ ఒక కన్ను మసక మసకగా, చాలా తక్కువ కనిపించే సమస్యతోనే కొనసాగుతూ వచ్చాడు. అది ఆపరేషన్ ద్వారా కూడా నయం అయ్యేది కాదని డాక్టర్లు తేల్చి చెప్పారు. అయితే అత్యాధునిక టెక్నాలజీతో ముడిపడి ఉన్న టెక్నికల్ పనిలో మైక్రాన్సు ప్రమాణంలో ఖచ్చితమైన కొలతలు పాటించవలసి వుంటుంది. కామ్రేడ్ అమన్ తన కంటి సమస్యను అధిగమిస్తూ పనుల్ని నేర్చుకోవడం కోసం ఎంతో పట్టుదలగా కృషి చేశాడు. సున్నిత పరికరాలైన మైక్రోమీటర్, వెర్నియర్, హైట్‌గేజ్, డెప్త్‌గేజ్ వంటి ఎన్నో పరికరాలతో పని చెయ్యటానికి నిరంతర సాధన చేసి నైపుణ్యం సాధించిన కార్మికవర్గ పుత్రుడు కా. అమన్.

టెక్నికల్ రంగంలో ఆ కామ్రేడ్ ప్రవేశించేనాటికి 12 బోర్ పిపి, ఎంఎన్-4 మోడల్ ఉత్పత్తిలో వుండింది. ప్రతి ఆయుధంలో కటింగ్, ఫైలింగ్ వంటి చేతిపనులను, బట్, పిస్టల్ గ్రిప్ లాంటి కర్ర పనులనేగాక అనేక రకాల స్ప్రింగ్స్ తయారీ, బ్రేజింగ్, సోర్జింగ్ వంటి అవసరమైన టెక్నిక్స్ నేర్చుకోవటంలో కూడా ఎంతో శ్రద్ధ, పట్టుదల కనబర్చేవాడు. ఈ రకమైన చేతిపనులొక ఎత్తయితే ఆయుధోత్పత్తిలో కీలకమైన పనులు లేథ్ మిషన్, మిల్లింగ్ మిషన్స్ మీద నైపుణ్యంగా పని చెయ్యాల్సి ఉంటుంది. కా. అమన్ 1995లోనే లేథ్ పనిలో ప్రవేశించి అనేక రకాల విడి భాగాలు, ఎక్విప్‌మెంట్స్, పరికరాలు తయారు చెయ్యటాన్ని నిరంతర శ్రమ ద్వారా నేర్చుకున్నాడు. 2007లో రూర్కెలాలో అరెస్టు అయ్యేనాటికి లేథ్, మిల్లింగ్ మిషన్‌పై మన పనులు నిర్వహించే ప్రధాన నాయకత్వ కామ్రేడ్‌గా అభివృద్ధి అయి ఎంతోమందికి నేర్పించగలిగే స్థాయికి ఎదిగాడు.

వర్క్ షాప్‌లో వివిధ టెక్నాలజీల సమ్మేళనంగా తయారై ఉత్పత్తి చేయబడ్డ వివిధ విడి భాగాలను ఒక ఆయుధంగా అసెంబ్లీ చేయటం ఆ రంగంలో మరో ప్రధాన విభాగం. వివిధ రకాల ఉత్పత్తులను అసెంబ్లీ చేసే పనుల్లో కూడా కా. అమన్ ఒక క్రమంలో నైపుణ్యాన్ని సాధించాడు. జైలు నుండి విడుదలై డికెకి వచ్చాక పశ్చిమ రీజియన్ టెక్నికల్ బాధ్యుడిగా పనిచేశాడు.

తుపాకుల ఉత్పత్తిలో నైపుణ్యం సంపాదించటం అనేది ఆయన ఎంతో స్వయం కృషితో, పనిని ఒక క్రమ పద్ధతిలో అధ్యయనం చెయ్యటం, అందుబాటులో ఉన్న పుస్తకాలు చదవటం, నాయకత్వ కామ్రేడ్స్‌తో చర్చించటం, తన ఆలోచనలు అభిప్రాయాలు యూనిట్ సమావేశాలలో ముందు పెట్టి అభివృద్ధికర పని పద్ధతులకై కృషి చెయ్యటం వంటి ప్రక్రియలోనే అభివృద్ధి చేసుకున్నాడు. పార్టీ పనికి అవసరమైన అనేక రకాల సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవటానికి ప్రైవేట్ వర్క్ షాపుల్లో వర్కర్‌గా చేరి తాను నేర్చుకుని వచ్చిన పనిని తన తోటి కామ్రేడ్స్‌కు నేర్పించాడు.

అందుబాటులో ఉన్న ఆయుధాల పుస్తకాలను, వాటిలోని డ్రాయింగులు, ఫోటోలు చూసి మెకానిజాన్ని, ఒక లివర్‌కు మరొక లివర్‌కు ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తూ నాయకత్వంతో చర్చించి తన జ్ఞానాన్ని పెంచుకునేవాడు. దాంతో పాటు పనిలో నైపుణ్యం సాధించడం కోసం నిరంతరం కృషి చేసేవాడు. శాంపిల్ పీస్ ఏది వచ్చినా అనేకసార్లు విప్పి బిగించి ఆ మెకానిజం మీద అవగాహన వచ్చేవరకు చర్చించటం, ఆలోచించటం, మళ్లీ మళ్లీ పరిశీలించటం చేసేవాడు. తనకు ఇంగ్లీషు చదువులో ఉన్న పరిమితిని దృష్టిలో పెట్టుకుని తన సహచరిని ఇంగ్లీషు నేర్చుకోవటానికి ప్రోత్సహించి ఆ కామ్రేడ్ ద్వారా మరింత అర్థం చేసుకోటానికి, పనిని అభివృద్ధి చేయటానికి ఎంతో ప్రయత్నం చేసేవాడు.

సాధారణంగా డెవలప్‌మెంట్ (అభివృద్ధి) పని అనేది ఉత్పత్తి పనికి భిన్నంగా నిరంతరం కొత్త పనినే చేయాల్సి ఉంటుంది. డెవలప్‌మెంట్ పనులను సులభంగా చెయ్యటానికి ప్రయత్నించేవాడు. ఈ పనుల్లో ఉండే ప్రమాదాలను కూడా లెక్క చేయకుండా వాటిని నిర్వహించటానికి ముందుండేవాడు. ప్రెస్ పని చేస్తున్న ఒక సందర్భంలో అతని మూడు వేళ్లూ చితికిపోయాయి. మరో సందర్భంలో చేతులు కాలాయి. మరోసారి ఒక చిన్న ఇనప ముక్క వేగంగా వచ్చి తగలడంతో ముందు పన్ను విరిగిపోయింది. అయినా ప్రమాదం ఉన్న పనులు నిర్వహించటానికి వెనకాడేవాడు కాదు. మరీ ముఖ్యంగా ఏదైనా ప్రమాదం జరగటానికి అవకాశం ఉందనిపించిన దగ్గర పై స్థాయి నాయకత్వం పాల్గొనటాన్ని వ్యతిరేకించేవాడు, నివారించేవాడు.

డెవలప్‌మెంట్ పనులు చేసేటప్పుడు సాధారణంగా నిర్ణీత సమయానికి పని బంద్ చెయ్యటం సాధ్యం కాదు. అనుకున్న రోజు పెట్టుకున్న లక్ష్యం పూర్తిచేయటానికి ఎక్కువ సమయం పని చెయ్యాల్సి ఉంటుంది. అలా ఒక్కోసారి అర్ధరాత్రి వరకూ కూడా పనిచేసేవాడు. తనతోటి కామ్రేడ్స్‌కు కార్మికవర్గ సమయపాలన గురించి అర్థం చేయించేవాడు. కమ్యూనిస్టు పనిస్ఫూర్తిని ప్రదర్శించేవాడు.

పార్టీ నిర్వహించే రాజకీయ తరగతులలో తన అనుభవంలో ఎదురైన సమస్యను ముందుకు తెచ్చి మంచి చర్చ జరగటానికీ, అందరికీ సమగ్ర అవగాహన ఏర్పడటానికీ తోడ్పడేవాడు. తను వరంగల్ జిల్లాలోనూ, జంట నగరాలలోనూ పనిచేసినప్పుడు వేరు వేరు స్వభావాలు కలిగిన కార్మికులతో కలుస్తూ రకరకాల పనులు నిర్వహించేటప్పుడు ఎదురైన అనుభవాలను చెప్పటం ద్వారా విషయాలు అందరికీ లోతుగా అర్థం కావటానికి తోడ్పడేవాడు.

తను స్కూలు చదువు వదిలి చిన్న వయసులోనే విప్లవోద్యమంలోకి వచ్చాడు కాబట్టి టెక్నికల్ రంగంలో కొలతలు లెక్కలు మైక్రాన్ ప్రమాణంలో అవసరమనేది గుర్తించాక అంతవరకూ

ఆ లెక్కల అవసరం గుర్తించకపోవటం గురించి తనలో తనే బాధపడేవాడు. తోటి కామ్రేడ్స్ సహాయంతో తన పని కవసరమైన లెక్కలు నేర్చుకొని క్రమక్రమంగా అభివృద్ధి సాధించిన అమన్ పట్టుదల మనందరికీ ఆదర్శమే. టెక్నికల్ పుస్తకాల అధ్యయనం కోసం ఇంగ్లీషు భాషను నేర్చుకునే ప్రయత్నం చేశాడు.

ఆయనకు కన్ను సమస్యే కాకుండా బిపి, నడుంనొప్పి వంటి పలు తీవ్ర శారీరక సమస్యలు ఉన్నా వాటిని లెక్క చేయకుండా తన కృషిని కొనసాగించాడు. నిరంతరం అధ్యయనం చేసేవాడు. టెక్నికల్ రంగం అనేది ఆధునిక టెక్నాలజీతో డైరెక్టుగా సంబంధం కలిగిన విభాగం. కనుక నేటి పరిస్థితిలో ఈ పనిని శత్రువుకు బలమైన కేంద్రాలైన నగరాలు, పట్టణాలలోనే నిర్వహించాల్సి వస్తుంది. అయితే శత్రువు కళ్లు గప్పి పనిని నిర్వహించే నైపుణ్యం సంపాదించడం ద్వారానే ఈ విప్లవావసరాలు తీర్చేలా పనిని సమర్థవంతంగా నిర్వహించటం సాధ్యమవుతుంది. కా. పులి అంజన్న మార్గదర్శకత్వంలో పని చేసిన కా. అమన్ ఈ నైపుణ్యాన్ని సంపాదించాడు. తను సాధించిన ఆ అనుభవాలు టెక్నికల్ రంగానికి ఎంతో ఉపయోగపడ్డాయి. పట్టణాలలో వివిధ కవర్లలో ఉంటూ పనిని నిర్వహించే క్రమంలో కా. అమన్ అనేక చోట్ల అనేక కొత్త పనులు నేర్చుకొని ఆ పనులు తోటి కామ్రేడ్స్‌కు నేర్పించి మన ఆయుధోత్పత్తిని నిర్భయంగా కొనసాగించడంలో ప్రముఖ భూమికను నిర్వహించాడు.

కా. అమన్ టెక్నికల్ రంగంలో ప్రవేశించేనాటికి టెక్నికల్ రంగంలో మహిళలకు ఓపెన్ వర్క్‌షాప్‌లో పని కల్పించటం ఎలా అనే సమస్య ముందుకు వచ్చింది. మహిళలు చేయగలిగే ప్రత్యేక పనులను ముందుగా కామ్రేడ్ అమన్ నేర్చుకున్నాడు. ఆ ప్రత్యేక వస్తువుల్ని ఫినిషింగ్ చెయ్యటం, ప్యాకింగ్ చెయ్యటం వంటి పనులు చేసే కవర్‌లో ఓపెన్ వర్క్ షాపుల్లో మహిళా కామ్రేడ్స్ పని చేయటం మొదలైంది. అలా కామ్రేడ్ అమన్ మహిళలు వర్క్ షాపుల్లో పని చెయ్యటానికున్న అడ్డంకుల్ని తొలగించటంలో తనవంతు కృషి చేశాడు.

వేరు వేరు పట్టణాలలో స్థానికంగా ప్రజల అవసరాలను తీర్చగలిగే వస్తువుల తయారీ పనులను నేర్చుకున్నాడు. అలా బయటి వర్క్‌షాపుల్లో పని నేర్చుకొనే క్రమంలో అక్కడి మేస్త్రీల, యజమానుల విశ్వాసం చూరగొన్నాడు. పని నేర్చుకుంటున్న క్రమంలో యజమానులు చెప్పిన పనల్లా చేసేవాడు. షాపు ఊడ్వటం నుండి మొదలు పెట్టి చాయ్‌గ్లాసులు కడగటం వరకూ అన్ని పనులూ మారు మాట్లాడకుండా చేసేవాడు. ఇలా వర్కర్‌గా చేరి అవసరమైన ఎన్నో టెక్నికల్ పనులను నేర్చుకున్నాడు. ఒక కమ్యూనిస్టుకు తన లక్ష్యాన్ని చేరటానికి ఎటువంటి పనులు చేయటమైనా నామోషీ కాదని తన ఆచరణ ద్వారా నిరూపించాడు.

కొరియర్‌గానూ, వర్క్‌షాపు నిర్వహించే క్రమంలోనూ టెక్నికల్ జాగ్రత్తలు తుచ తప్పకుండా పాటించేవాడు. వస్తువుల తయారీ కాలంలో, తయారయిన వస్తువులను తరలించే సమయంలో సహజమైన కవర్‌లో పనులను నిర్వహించేవాడు. లోకల్ రవాణా క్రమంలో లేదా ఫీల్డ్‌కు అందించే క్రమంలో చెకింగ్‌లు జరిగినప్పుడు తొణకకుండా జవాబులిచ్చేవాడు. ఎటువంటి సందేహాలకూ తావివ్వకుండా తయారయిన యుద్ధ సామగ్రిని గమ్యానికి చేర్చేవాడు.

## ప్రజలతో స్నేహాన్నే కవచంగా ధరించిన ప్రజాసైనికుడు

డంపులలో నిల్వ డబ్బును బ్యాంకులో మార్చుతున్న ఒక సందర్భంలో వాటిని నకిలీ నోట్లుగా అనుమానించిన బ్యాంకు అధికారులు కామ్రేడ్ అమన్‌ను పోలీసులకు అప్పగించారు. ఇలాంటి సమస్య ఎదురు కావచ్చని ముందే ఊహించిన కామ్రేడ్ అమన్ ఏ మాత్రం తొణకకుండా బ్యాంకు అధికారులకూ, పోలీసులకూ నిబ్బరంగా జవాబులిచ్చాడు. ఇరుగుపొరుగుల వారితో స్నేహంగా ఉంటూ వారి విశ్వాసాన్ని చూరగొని ఆపదలో తనకు అండగా నిలబడగలిగేలా చేసుకున్నాడు. తన కలుపుగోలు స్వభావంతో వారి హృదయాలను గెల్చుకున్నాడు. తర్వాత పోలీసులు జరిపిన ఎంక్వయిరీలో అవి దొంగనోట్లు కావని తేలటంతో సమస్య పరిష్కారమైంది.

ప్రజలతో సంబంధాల విషయంలో కామ్రేడ్ అమన్ ఎక్కువ శ్రద్ధ పెట్టేవాడు. తాము ఉ ంటున్న చుట్టుపక్కల ప్రజలకు ముఖ్యంగా ఇంటి చుట్టుపక్కల ఉండే కుటుంబాల వారికి ఎంతో సహాయం చేసేవాడు. ప్రత్యేకించి మహిళలకు, వృద్ధులకు సహాయం చెయ్యటంలో శ్రద్ధ చూపేవాడు. దారిలో వస్తూ పోతున్నపుడు ఎవరైనా మహిళ రెండు బ్యాగ్‌లు మోస్తూ ఇబ్బంది పడుతుంటే చొరవగా తానొక బ్యాగ్ అందుకుని ఆ మహిళకు సహాయం చేసేవాడు. పట్టణాలలో మంచినీటి కోసం ఎంతో శ్రమపడాల్సి ఉంటుంది. ఎవరికి వాళ్లే ముందు నింపుకోవాలని ఆరాటపడతారు. ఇళ్లల్లో పని వత్తిడి ఉన్న మహిళలకు ముందు అవకాశం ఇవ్వాలని తాను చివరి లైన్లో నిలబడేవాడు. పెద్ద వయస్సు వాళ్లయితే నీళ్ల బిందె ఇంటివరకూ దించి వచ్చేవాడు. బజారుకి పోతున్నప్పుడు తోటి కామ్రేడ్స్, ఇరుగుపొరుగు వారు ఏదైనా వస్తువులు తెచ్చిపెట్టమని అడిగితే తప్పక తెచ్చి ఇచ్చేవాడు. అనారోగ్యంతో బాధపడే కామ్రేడ్స్‌కు అవసరమైన సహాయం అందించే వాడు. ఇలా తన సేవాభావంతో ఎందరో ప్రజలకూ, కామ్రేడ్స్‌కూ సన్నిహితుడైనాడు.

రూర్కెలాలో తాము కిరాయికి ఉంటున్న ఇంటి యజమాని కులాంతర వివాహం చేసుకోవటంతో అతన్ని తన బంధువులంతా వెలివేశారు. ఆయన చనిపోయినా బంధువులెవరూ రాలేదు. వారికి నలుగురు ఆడపిల్లలే. దాంతో ఆ తల్లికి పెద్ద కొడుకులా, అన్నీ తానై సహాయం చేశాడు. ఆ ఇంటి ఆడపిల్లలు కూడా తనను పెద్దన్నగానే భావించేవారు. చుట్టుపక్కల అందరితో

మంచి సంబంధాలు ఉండేవి. పోలీసులు అరెస్టు చేసినప్పుడు వాళ్లంతా ఎంతో మంచివాళ్లని ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు. నక్సలైట్లంటే మొదట నమ్మలేదు. వర్క్‌షాప్‌లో దొరికిన తుపాకుల మ్యాగజైన్లు చూసి అప్పుడు 'నక్సలైట్లంటే ఇంత మంచివాళ్లా' అని సంతోషపడుతూనే ఆశ్చర్యపోయారు.

జైలు నుండి విడుదలైన తర్వాత తనకు పరిచయం లేని అడవి ఉద్యమంలో, ఎన్ని శారీరక సమస్యలున్నా, అక్కడి పరిసరాలతో ఎన్ని సమస్యలెదురైనా ఎదుర్కొని దృఢంగా ముందుకు సాగటానికి తనలో తాను ఎంతగానో సంఘర్షించాడు. బయట కార్ఖానాల్లో ఉండే పని పద్ధతులకూ, ఫీల్డులో ఉండే పని పద్ధతులకూ మధ్య వుండే తేడాను అర్థం చేసుకుంటూ క్రమక్రమంగా అనుభవాల నుండి నేర్చుకుంటూ పురోగమించాడు.

కామ్రేడ్ అమన్ సుదీర్ఘ విప్లవ జీవితంలో అత్యధిక భాగం పట్టణాల్లోనే ఉండి పనిచేశాడు. సామ్రాజ్యవాద కుళ్లు సంస్కృతికి నిలయాలైన పట్టణాలలో ప్రజాయుద్ధానికి అత్యంత ఆవశ్యకమైన ఆయుధాల్ని తయారు చేసే కర్తవ్యాన్ని చేపట్టి అనుదినం ఎదురయ్యే ఎన్నో సమస్యల్ని సమయస్ఫూర్తితో పరిష్కరించుకుంటూ తనెంచుకున్న కమ్యూనిస్టు ఆదర్శాల కోసం గట్టిగా నిలబడ్డాడు. ఎటువంటి పెడధోరణులకూ గురికాకుండా నిరంతరం తనను తాను ప్రక్షాళన చేసుకున్నాడు. ఎలాంటి అవలక్షణాలకూ, ప్రలోభాలకూ గురికాలేదు. పట్టణాల్లో వివిధ పనులు నిర్వహించే కామ్రేడ్స్ అందరూ కా. అమన్‌ను ఈ విషయాల్లో ఆదర్శంగా తీసుకోవాలి.

పార్టీ తనకే కర్తవ్యం ఇచ్చినా దానిలో ఉన్న సాధక బాధకాలనెదుర్కొంటూ ఆ కర్తవ్యాన్ని సఫలం చెయ్యటాన్కి నిరంతరం కృషి సల్పిన గొప్ప అంకితభావం ఆయనది. కేంద్ర ఆర్గనైజరు గార్డుగా ప్రారంభమైన ఆయన విప్లవ జీవితంలో కొరియర్‌గా, డెన్ నిర్వాహకుడిగా, ప్రజా శత్రువులను నిర్మూలించిన యాక్షన్ టీముల్లో సభ్యునిగా, ప్రచార రంగానికి అవసరమైన పోస్టర్స్, కరపత్రాలు అందించే డ్రైవర్‌గా, ఆయుధాల రవాణాదారుగా, స్టోర్ కీపర్‌గా, ఆయుధ శిల్పిగా బహుముఖ కృషి సల్పిన కొద్దిమంది పార్టీ కామ్రేడ్స్‌లో కామ్రేడ్ అమన్ కూడా ఒకరు.

## ఆదర్శప్రాయమైన విప్లవ సాహచర్యం

కామ్రేడ్ అమన్ తన తన జీవిత భాగస్వామిని గౌరవంగా, సమాన హోదాలో చూసేవాడు. ఆమె అభివృద్ధికి పూర్తి సహకారం అందించేవాడు. వాళ్లిద్దరూ అటు పనిదగ్గర, ఇటు ఇంటి పనులలోనూ పరస్పర సహాయ సహకారాలందించుకుంటూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఇంటి పనులలో తనే ఎక్కువ బాధ్యతపడుతూ పూర్తి ప్రజాస్వామిక పద్ధతిలో నిర్వహించటానికి ప్రయత్నించేవాడు. తన ఇష్టాయిష్టాలను సహచరిపై రుద్దే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు.

తన సహచరికి టెక్నికల్ పనులు నేర్పించటంలో ఎంతో ఓపికగా బోధించేవాడు. పనిలోని మెళకువలు, జాగ్రత్తలు, నాణ్యత సాధించటానికి శ్రద్ధ పెట్టాల్సిన విషయాలను మళ్లీ మళ్లీ చెపుతూనే ఉండేవాడు. తన సహచరికి తెలిసిన విషయాలను నేర్చుకోవటానికి ఆసక్తి చూపుతూ తానొక విద్యార్థి లాగా నమ్రతతో వ్యవహరించేవాడు. పనుల్ని తొందరపాటుతో కాకుండా నెమ్మదిగా, ఓపికగా చేయాల్సిన అవసరాన్ని అర్థం చేయించేవాడు. ప్రమాదాలతో కూడుకుని ఉన్న కీలకమైన పనులను ఇద్దరూ కలిసి సునాయాసంగా నెరవేర్చుకొచ్చేవారు. ప్రమాదవశాత్తు అరెస్టు అయి శత్రువు చేత చిక్కితే మనో నిబ్బరంతో, ధైర్యంగా వుండాలని అర్థం చేయించేవాడు. అతను నేర్పిన విషయాలు రూర్కెలాలో అరెస్టు అయినపుడు శత్రువు చేసిన రకరకాల ఇంటరాగేషన్‌ను నిబ్బరంగా ఎదుర్కొని నిలబడటానికి అతని సహచరికి ఎంతో ఉపయోగపడ్డాయి.

## అమన్ ఆశయాల్ని, ఆదర్శాల్ని అలవర్చుకుందాం!

ప్రజల పట్ల, పార్టీ పట్ల అచంచల విశ్వాసం, అపార ప్రేమ, వ్యక్తిగత క్రమశిక్షణ, సాధారణ జీవనశైలి, నిరాడంబరమైన మాట తీరు, విప్లవ కర్తవ్య నిర్వహణలో ఎన్ని అవాంతరాలెదురైనా పట్టువదలక లక్ష్యం నెరవేరే వరకూ కృషి చేసే ఓపిక, కర్తవ్య నిర్వహణ కవసరమైన ఏ పనినైనా పట్టుదలగా నేర్చుకొనే గుణం, తన ఆరోగ్య సమస్య ఎంత సీరియస్‌గా ఉన్నా తోటి కామ్రేడ్స్ ఆరోగ్యం గురించి అక్కర, సున్నితత్వం వంటి కమ్యూనిస్టు విలువలు అతని నుండి అందరూ నేర్చుకోదగినవి, అవి అందరికీ ఆదర్శం. చెదరని చిరునవ్వు ఆయనకు ఆభరణంగా ఉండేది.

టెక్నికల్ రంగం అభివృద్ధికీ, విప్లవాశయ సాధనకూ 28 సంవత్సరాలు అవిశ్రాంతంగా శ్రమించిన కా. అమన్‌ను కోల్పోవటం విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టమే. ప్రస్తుత పరిస్థితుల్లో దండకారణ్యంలో ప్రజాయుద్ధాన్ని పురోగమింప చేయడంలో భాగంగా మిలీషియాను పెద్ద ఎత్తున సాయుధం చేయాలనే కర్తవ్యాన్ని చేపట్టారు. దాన్ని సాధించడంలో కా. అమన్ అకాల మృతి పెద్ద లోటుగానే వుంటుంది.

అయితే ప్రజాయోధులకు చావు లేదు. కామ్రేడ్ కనకస్వామికి మరణం లేదు. ఆయన తయారుచేసిన ఆయుధాలు పిఎల్‌జిఏ యోధుల భుజాలపై పదిలంగా వున్నాయి. గ్రీన్‌హంట్ పేరుతో విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించి, దేశ సహజ సంపదలన్నీ సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్లకు కట్టబెట్టాలని చూస్తున్న దేశ దోపిడీ పాలకవర్గాలతో సవాలు విసరడానికి అవి సిద్ధంగా వున్నాయి. నేడు దండకారణ్యం నడిబొడ్డున, బస్తర్‌లో శిక్షణ పేరుతో తిష్టవేసి విప్లవోద్యమ అణచివేతలో పాలు పంచుకోవడానికి త్వరపడుతున్న భారత సైన్యాన్ని

ఓడించడంలో అవి తమ వంతు పాత్రను తప్పక నిర్వహిస్తాయి. ఆయన అభివృద్ధి పరిచిన టెక్నిక్, ఆయన అందించిన పరిజ్ఞానం పిఎల్‌జిఏ స్వంతమైనాయి. ఆయన వద్ద టెక్నీషియన్లుగా ఆయుధ తయారీ పరిజ్ఞానం పొందిన సహచర కామ్రేడ్స్, పీఎల్‌జీఏ పోరాటయోధులు, ప్రజలు ఆయన వదిలిపోయిన కర్తవ్యాలను తుదకంటా కొనసాగిస్తారు. వారికి ఆయన సదా స్ఫూర్తిగా నిలుస్తాడు.

దండకారణ్యంలోని ఒక కుగ్రామంలో కామ్రేడ్ అమన్ అంత్యక్రియలు విప్లవ సంప్రదాయాలతో పిఎల్‌జిఎ యోధుల, ప్రజల అశ్రునివాళిలో, విప్లవ నినాదాలు మిన్నంటుతుండగా ముగిశాయి. ఆ గ్రామ ప్రజలు కామ్రేడ్ అమన్‌ను తమ కన్నబిడ్డగా స్వంతం చేసుకుని స్వయంగా తమ పూర్వీకుల చితి ఉండే ఒక జాగాను తామే ఎంపిక చేసి ఇచ్చి అమరుని పట్ల తమ ప్రేమను చాటుకున్నారు. ఆయన సహచరి చితికి నిప్పంటించింది. దండకారణ్య వ్యాప్తంగా విషాదవార్త పాకగానే కామ్రేడ్స్ ఎక్కడికక్కడ సంస్మరణ సభలు జరిపి కామ్రేడ్ అమన్‌కు ఘనంగా నివాళులర్పించారు. అతని కుటుంబానికి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సంతాప సందేశాన్ని పంపింది.

ఆయన విప్లవోద్యమంలో, ప్రజల, ప్రజాగెరిల్లాల హృదయాలలో చిరస్థాయిగా నిలిచివుంటాడు. ఆయన విప్లవోద్యమంలో దీర్ఘకాలంగా, దృఢ సంకల్పంతో పనిచేసి నెలకొల్పిన ఆదర్శాలు భావి తరాలకు ప్రేరణగా నిలుస్తాయి. సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడినీ అంతం చేసి కార్మిక-కర్షక ఐక్యతా పునాదిపై పీడిత వర్గాల సంయుక్త రాజ్యాధికారాన్ని నెలకొల్పి, ఎలాంటి దోపిడీ పీడనలకు, అన్యాయాలకు, వివక్షకు తావు లేని నవ సమాజాన్ని ఆవిష్కరించడం కోసం అలుపెరుగక పోరాడడమే కామ్రేడ్ అమన్‌కు నిజమైన నివాళి అవుతుంది.

**అలుపెరుగని విప్లవ యోధుడు, ఎర్ర టెక్నీషియన్ కామ్రేడ్ కనకస్వామి అమర్‌హై!**

**అమర వీరుడు కామ్రేడ్ అమన్ ఆశయాల్ని పరిపూర్తి చేద్దాం!**

**భారత నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వర్ధిల్లాలి!**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ**

**డిసెంబర్ 2, 2012**